విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 21, జూలై 2023

పంటలకు ఊపిరి పోస్తున్న వర్షాలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాలలో వర్షాధారంగా సాగుచేసిన పంటలకు ఇటీవల కురుస్తున్న హెరావ్ మోస్తారు వర్షాలు ఊపిరి పోస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనాటి నుండి భారీ వర్షాలు లేనప్పటికీ విత్తనం వేయడానికి సరిపడా వర్షాలు వద్దాయి.దీంతో మండలంలోని పెట్నికోట,గోరుమానుపల్లి, మదనంతపురం,నందిపాడు,పెద్ద వెంతుర్ల,చింతలాయిపల్లి, తదితర గ్రామాల పరిధిలో వర్షాధారంగా కంది, ఆముదం,పత్తి,మొక్కజొన్న, మినుము తదితర పంటలను 20రోజుల కిందట రైతులు సాగు చేశారు. ఐదారు రోజులుగా కురుస్తున్న మోస్తారు వర్షాలు ఆయా పంటలకు ఊపిరి పోస్తున్నాయి.భూగర్భ జిల్లాలు పెరిగేంత వర్షాలు లేకపోవడంతో బోరుబావులు కింద సాగు చేసే రైతులు భారీ వర్షాల కోసం వేచి చూస్తున్నారు. వంకలు వాగులు ప్రవహించి కుంటలు, చెరువులలోకి నీరు చేరి భూగర్భ జలాలు పెరిగితే ఇతర పంటలు సాగు చేయడానికి రైతన్నలు సిద్ధమవుతున్నారు.

మొక్కజొన్న పంటల సందర్శన

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : జిల్లా ఏరువాక కేంద్రం,

నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్ట్ (సస్యరక్షణ) డా. ఏ. రామకృష్ణారావు , ఎ.డి.ఎ, ఆత్మకూరు, బి. ఆంజనేయులు,మండల వ్యవసాయ అధికారి, ఆత్మకూరు బి. విష్ణువర్ధన్ రెడ్డి మరియు ఆర్ బి కే వీఏ.ఏస్‌లు అరవింద్, కావ్య సంయుక్తంగా కలిసి ఆత్మకూరు మండలంలోని కరివేన, నల్ల కాలువ, ఆత్మకూరు గ్రామాలలోని మొక్కజొన్న పంట పొలాలలో క్షేత్ర సందర్శించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు మరియు కాండం తొలుచు పురుగు ఆశించి నష్టం కలగజేస్తున్నట్లు గమనించారు. రైతులు సస్యరక్షణకు తొలుచు పురుగు నుండి మొక్కజొన్నను రక్షించుటకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

విజయవంతంగా ఉచిత శస్త్ర చికిత్సల వైద్య శిబిరం

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణంలోని మధుమణి నర్సింగ్ హెూమ్‌లో గత సోమవారం ప్రారంభించబడిన 32వ ఉచిత చెవి, ముక్కు, గొంతుశస్త్ర చికిత్సల శిబిరం విజయవంతంగా కొనసాగుతున్నది. సోమవారం రోగులను ఎంపిక చేసుకుని అవసరమైన పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలకు సిద్ధం చేసి మంగళవారం నుంచి రోజుకు 15 ఆపరేషన్ల చొప్పున చేస్తున్నారు. గురువారం సాయంత్రానికి 50 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. వారం రోజుల్లో మధుమణి ఆసుపత్రి నిర్వాహకులు ప్రముఖ చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మధుసూధన్ రావు, డాక్టర్ మణిదీప్, రోహిత్ లతో పాటు దేశంలో వివిధ నగరాలకు చెందిన ప్రఖ్యాత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ దీపక్ హల్దిపూర్, సతీష్ జైన్, శంకర్ మెడికేరి, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసమూర్తి, ఆర్షద్ హుస్సేన్, విద్యాసాగర్, శ్రీపతి నాయుడు, తేజస్విని తదితరులు ఈ నెల 23వ తేదీ వరకు మొత్తం 100 శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయడం జరుగుతుంది. ఈ శస్త్ర చికిత్సలకు అవసరమైన అనస్థీషియాను ప్రముఖ మత్తు మందు వైద్యులు డాక్టర్ జి. రవికృష్ణ, డాక్టర్ డి. మాధవి అందజేస్తున్నారు.

హామీలను నెరవేరుస్తున్న సీఎం జగన్

విశాలాంధ్ర - మిడుతూరు : రాష్ట్రంలో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అని నాగలూటి గ్రామ సర్పంచ్ టి. ఉషారాణి తెలిపారు. గురువారం మండల పరిధిలోని నాగలూటీ గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నాగ శేషాచల రెడ్డి, తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఈఓ ఆర్ డి ఫక్రుధీన్ , వ్యవసాయ అధికారి పీరు నాయక్ ,ఎంపీటీసీ నబీ రసూల్‌ల ఆధ్వర్యంలో గ్రామాలలోని లబ్ధిదారులకు వారు అప్లై చేసుకున్న 594 కీ పైగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సింగిల్ విండో చైర్మన్ టీ .నాగ తులసి రెడ్డి ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివరామ కృష్ణారెడ్డి. టీ సర్వేశ్వర రెడ్డి . టీ . రాంభూపాల్ రెడ్డి లు జగనన్న సురక్ష ప్రోగ్రాం గురించి, ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో పంచాయితీ కార్యదర్శులు వీరం వెంకట సుబ్బారెడ్డి .షేక్ షా వలి,సచివాలయం సిబ్బంది,వాలంటీర్స్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సుగాలి ఆదిలక్ష్మి బాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - నంద్యాల : ఇటీవల విషజ్వరంతో మృతిచెందిన కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయురాలు సుగాలి ఆదిలక్ష్మిబాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాల నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.గురువారం ఆయన పాత్రికేయుతో మాట్లాడుతూ నంద్యాల జిల్లా గాజులపల్లె గ్రామానికి చెందిన నాగమ్మబాయి సూర్య నాయక్ దంపతుల కూతురు విభిన్న ప్రతిభావంతురాలైన సుగాలి ఆదిలక్ష్మిబాయి నేరవాడ మినీ గురుకులంలో గత 12 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ గత వారంలో విష జ్వరంతో కోలుకోలేక మరణించడం జరిగిందని,ఆమెపై ఆధారపడి వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రులున్నారని,వారు కూలి పని ద్వారా జీవనం కొనసాగిస్తున్నారని, కావున ఆదిలక్ష్మి బాయి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

నంద్యాలలో ఘరానా మోసం

- జల్సాలకు అలవాటు పడి బాడుగకు కార్లు తీసుకొని తాకట్టు

విశాలాంధ్ర - నంద్యాల : జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు బాడుగకు కార్లు తీసుకొని తాకట్టు పెడుతూ 23లక్షల వరకు కాజేశాడని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల టౌన్ విశ్వనగర్ కు చెందిన చాకలి చంద్రభూపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిఎస్పీ మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో సీఐ వి.ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి, వారి సిబ్బంది నంద్యాల పట్టణం సాయిబాబానగర్ కు చెందిన ముద్దాయి షేక్ అన్సర్ హుస్సేన్ ఎస్బిఐ కాలనీ సింగ్ టవర్స్ అపార్ట్మెంట్స్ వద్ద అరెస్టు చేసి, అతడిని విచారించగా సదరు ముద్దాయి నంద్యాలలో బిసిఎ వరకు చదువుకొని, గత కొంత కాలముగా చెడు వ్యసనాలకు బానిసై, అతడి జల్సాలకు డబ్బు సరిపోక తనకు తెలిసిన వారివద్ద అవసరముందని చెప్పి కొన్ని కార్లు బాడుగకని కొన్ని కార్లను తీసుకొని, వాటిని ఇతరుల వద్ద కుదువ పెట్టి డబ్బులు తీసుకొని, ఆ డబ్బులను తన జల్సాలకు వాడుకున్నాడని,ఆ విధముగా సదరు ముద్దాయి ఇతరుల వద్ద మొత్తం 13 వాహనాలను తీసుకొని, ఇతరుల వద్ద కుదువ పెట్టి మొత్తం సుమారు 23 లక్షల రూపాయల నగదును తీసుకొని వాటిని యజమానులకు ఇవ్వకుండా, డబ్బులు కట్టకుండా మోసం చేశాడని, తరువాత వాహనాల యజమానులు డబ్బు కట్టమని లేకపోతే తమ వాహనాలను తిరిగి ఇచ్చేయ్యమని ఒత్తిడి చెయ్యగా, వారినుండి తప్పించుకొని తిరిగేవాడన్నారు.ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన సిఐ, ఎస్ఐ, సిబ్బంది ఇమ్మానుయెల్, చెన్నయ్యలను ఎస్.పి అభినందించారు.

ఎన్నికలలో ప్రతి కార్యకర్త సైనికుడు లాగా పని చేయాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రానున్న ఎన్నికలలో ప్రతి కార్యకర్త సైనికుడి లాగా పనిచేసి టిడిపి విజయానికి కృషి చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా గురువారం ఆళ్లగడ్డ పట్టణంలో టీఎస్ ఫంక్షన్ హాల్లో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో పట్టణానికి సంబంధించిన క్లస్టర్ ఇన్చార్జిలకు, యూనిట్ ఇన్చార్జిలకు, భూత్ ఇంచార్జ్ లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ఓటర్ వెరిఫికేషన్ మరియు ఆర్టిఎస్ వాట్సాప్ గ్రూప్ల విశిష్టతను మరియు మన టిడిపి ఆప్ ప్రత్యేకతల గురించి పార్టీ నియమించిన ట్రైనర్స్ వివరించడం జరిగింది ..ఈ కార్యక్రమానికి అఖిలమ్మ అధ్యక్షత వహించి కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. అలాగే దొర్నిపాడు మండల కేంద్రంలో క్లస్టర్, యూనిట్ టిడిపి బూత్ కమిటీ సభ్యులకు గురువారం మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అఖిలప్రియ బూత్ కమిటీ సభ్యులకు పలు కీలక ఆదేశాలను ఇచ్చారు. రానున్న ఎన్నికలలో ప్రతి కార్యకర్త సైనికుడు లాగా పనిచేసి టిడిపి విజయానికి నాంది పలకాలని మాజీ మంత్రి అఖిలప్రియ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల బూత్ లెవెల్ కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన బిజెపి

విశాలాంధ్ర - నంద్యాల : నిరుద్యోగులను మోసం చేసిన బిజెపి నాయకులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఎఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు ఆరోపించారు. నంద్యాల సీపీఐ కార్యాలయంలో జరిగిన ఎఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో నాగరాముడు మాట్లాడుతూ నిరుద్యోగిని మోసం చేసి 16 లక్షల రూపాయలు తీసుకోని నకిలీ ఉద్యోగ జాయిన్ ఆర్డర్ ఇచ్చిన డోన్ బిజెపి నాయకుడు రామయ్యపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అతనిని అరెస్టు చేయాలన్నారు. నిరుద్యోగికి న్యాయం చేయాలని, అతని డబ్బు అతనికి తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం డోన్ లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించగా నిరుద్యోగి కుటుంబానికి న్యాయం చేయాల్సిన పోలీసులు ,న్యాయం

చేయాలని పోరాటం చేస్తున్న ఏఐవైఎఫ్ డోన్ తాలూకా నాయకులపైన అక్రమ కేసులు బనాయించడం అప్రజాస్వామన్నారు.తక్షణమే ఏఐవైఎఫ్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, బిజెపి నాయకుని చేతిలో మోసపోయిన నిరుద్యోగి కుటుంబానికి న్యాయం చేయాలని లేనిపక్షంలో డోన్ డిఎస్పి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి రవి, నాయకులు ఎర్రిస్వామి, రమణ, మనోహర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నంద్యాల : నిరుద్యోగ యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఫిష్ ఆంధ్ర యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణం పద్మావతినగర్ ఇండోర్ స్టేడియం రోడ్ లో ఫిష్ ఆంధ్ర 10 లక్షల విలువ చేసే యూనిట్ ను జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్, ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఫిష్ ఆంధ్ర యూనిట్ల స్థాపనకు నిరుద్యోగ యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మొదటిసారిగా ఏపీజీబీ బ్యాంక్ సహకారంతో రజియాబి 10 లక్షల ఫిషాంధ్ర యూనిట్ ను స్థాపించారన్నారు. జిల్లాకు మంజూరైన 10 లక్షల విలువగల 25 యూనిట్లు, 20 లక్షల విలువగల 7 యూనిట్లు, 50 లక్షల విలువగల రెండు యూనిట్లను 40, 60 శాతం సబ్సిడీతో వినియోగించుకునేందుకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జెడి రాఘవరెడ్డి, ఏడి సంధ్యారాణి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి పాల్గొన్నారు.

32లక్షల వ్యయంతో పార్క్ ఏర్పాటు

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లాకు తగ్గట్టుగా పట్టణంలో ప్రజలకు ఆహ్లాదకర

వాతావరణాన్ని కల్పించేందుకు పార్క్ లను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 36వ వార్డు రైతుబజార్ ప్రాంతంలో నూతనంగా 31 లక్షల 80వేల రూపాయల వ్యయంతో నిర్మించిన పార్కును ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ నాగినిరవిసింగారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డా. శశికళరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ అధికారులు, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణ సుందరీకరణ, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పార్క్ ల అభివృద్ధి చేపట్టామన్నారు.

రోడ్డు పనులు తనిఖీ

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణంలోని పద్మావతి నగర్ యందు నూతనంగా

నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు, డ్రైనేజి కాలువల పని తీరును గురువారం నాడు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి, కమిషనర్ రవిచంద్రారెడ్డిలు అకస్మికంగా తనిఖీ చేశారు. పనుల నాణ్యతను వారు పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్ లను ఆదేశించారు. వీరి వెంట మున్సిపల్ ఎమ్ఈఈ రమణమూర్తి, డీఈలు జయభరత్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మదుకుమార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నందికొట్కూరు : వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ

ఆధ్వర్యంలో ఆగస్టు రెండో వారంలో తలపెట్టిన చలో హైదరాబాద్ మాదిగల మూడో విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు సుభాష్ చంద్ర పిలుపునిచ్చారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని స్థానిక ఎంఆర్పిఎస్ కార్యాలయం నందు ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు ప్రేమ రాజు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం మందకృష్ణ ఆధ్వర్యంలో గత 29 సంవత్సరాలు నుంచి అంబేద్కర్ రాజ్యాంగంలో కనపరిచిన విధంగా ఎస్సీల వర్గీకరణ జరగాలని పోరాటం చేస్తున్నారన్నారు. 59 కులాలకు కులగనన 15% రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎన్నో నిర్బంధాలతో ప్రాణాలకు తెగించి పోరాడినప్పటికీ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు మాట ఇస్తున్నారు తప్ప మాదిగల ఓట్లు వేయించుకున్న తరువాత విస్మరించి వర్గీకరణ చేయడం లేదన్నారు. ఎలక్షన్ల ముందర పార్లమెంటులో బిజెపి అడుగుపెడితే వర్గీకరణ బిల్లు పెడతామని హామీ ఇచ్చారని అయితే అధికారం లోకి వచ్చిన తర్వాత బిల్లు పెట్టకుండా ఇప్పటివరకు కాలయాపన చేయడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. రేపు జరగబోయే అసెంబ్లీ ఎలక్షన్లలో రెండు తెలుగు రాష్ట్రాలలో వర్గీకరణకు ఎవరైతే మద్దతు ఇస్తారో వారికి రెండు రాష్ట్రాల లో మాదిగల ఓట్లు వేస్తామన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలనే మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టు రెండో వారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విశ్వరూప మహాసభను ప్రతి పల్లె నుంచి మాదిగలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

విశాలాంధ్ర కొలిమిగుండ్ల : ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృత్యువాత పడ్డ ఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన బత్తుల శివకుమార్ 25 ఆర్టీసీ బస్సు ఢీకొని మృత్యువాత పడ్డాడు. శివమకుమార్ గ్రామంలోని ప్రధాన రోడ్డు పక్కన నిలబడి ఉండగా బనగానపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు తాడపత్రి నుండి బనగానపల్లె కు వెళ్తూ ఢీకొన్నది. తీవ్రంగా గాయపడ్డ శివకుమార్ ను కుటుంబ సభ్యులు తాడపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జగనన్న సురక్ష ప్రజలకు రక్ష

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : పట్టణంలో జగనన్న సురక్ష

కార్యక్రమం కమీషనర్ రమేష్ బాబు, తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి అధ్యక్షతన 5,6 సచివాలయాలలో జరిగింది.ఈ కార్యక్రమాలలో పాల్గొన్న ఎంపిపి బుగ్గన నాగ భూషణం రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు రక్షణ లాంటిదని, ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తక్షణమే పరిష్కారానికి మార్గమని,ప్రభుత్వం అందించే11 రకాల ధ్రువీకరణ పత్రాలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలకు అందించే ధృవ పత్రాలలలో జాప్యం జరగకుండా తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి,సంబంధిత అధికారులు రాత్రింబవళ్లు కష్ట పడి సిద్ధం చేసి అందిస్తున్నామని, ప్రజలకు ఇంత మేలు చేసే ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ ఆదరించాలని కోరారు.ఆయా కార్యక్రమాలలో డిటి సత్యదీప్, ఆర్ఐ శ్రీదేవి,అధికారులు జావిద్,మధు, నరేంద్ర, శేఖర్, మధు సూధన్ రెడ్డి, కౌన్సిలర్స్అంజి, నాగ వెంకటేశ్వర్లు, మధు కుమార్,మల్లీశ్వరి,జ్యోతి,సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి,మూర్తుజవలి, వైస్ ఖాజా జి. నాగరాజు, దస్తగిరి,తిరుమలేష్ రెడ్డి,రామ నాయుడు,విఆర్వోలు, సంబంధిత సెక్రటరీలు,వాలంటీర్లు,అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బనగానపల్లి: బనగానపల్లె మాజీ శాసనసభ్యులు బీసీ

జనార్దన్ రెడ్డి రథ సారథి రమణ తండ్రి నరసింహులు అనారోగ్యం తో బాధపడుతూ ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం ఈ విషయం తెలుసుకుని బీసీ రమణ స్వగృహంకు వెళ్లి పరామర్శించారు .ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు సిద్ధం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు

చేసేందుకు ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటుందని తహశీల్దార్ హరినాథ రావు అన్నారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో తప్పులు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఎందుకు రాజకీయ పార్టీల వారు ఒక్క ప్రతినిధిని నియమించుకొని బూత్ లెవెల్ అధికారులతో కలిసి పని చేయవచ్చన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మజరా గ్రామాల్లో ప్రత్యేక పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, గంగుల రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జలాల్ బషీర్ అహ్మద్

విశాలాంధ్ర -బనగానపల్లి: రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం జాయింట్ సెక్రటరీగా బనగానపల్లె శాఖ గ్రంథాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్ ని రాష్ట్ర సంఘంలో ఎన్నుకోబడ్డారు. గురువారం జలాల్ బషీర్ అహ్మద్ పాత్రికేయులతో మాట్లాడుతూ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను నియమించినందుకు రాష్ట్ర సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిచ్చిన ఈ పదవులను సక్రమంగా నిర్వహించడానికి తమ సహాయ శక్తుల కృషి చేస్తామని తెలియజేశారు.

విద్యా దీవెన నిధులను విడుదల చేయాలి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న జగనన్న

విద్యా దీవెన నిధులు విద్యార్థులకు అంద చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా ఆర్గనైజింగ్ కార్యదర్శి దినేష్ ప్రభుత్వాన్ని కోరారు. జూపాడుబంగ్లా మండలం కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఏఐఎస్ఎఫ్ తాలూకా ఆర్గనైజింగ్ కార్యదర్శి దినేష్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన డబ్బులు రానందువల్ల విద్యార్థులు కళాశాలల కు చెల్లించవలసిన ఫీజులు చెల్లించ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లు అందక సర్టిఫికెట్లు కోసం కళాశాలకు వెళితే మీరు కళాశాల ఫీజులు చెల్లించాలని విద్యా దీవెన పథకం ప్రభుత్వం నిధులు విడుదల చేసినా చెయ్యక పోయిన విద్యార్థులే ఫీజులు చెల్లించాలని చెల్లించక పోతే ఏదో ఒక విధంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు ఆయన అన్నారు.పరీక్ష ఫీజులు కట్టించుకోకపోవడం వలన అనేక విధాలుగా వేధిస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచన చేసి జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అవుకులో క్షుద్ర పూజల కలకలం

విశాలాంధ్ర- అవుకు : అవుకు జలాశయం పరిసర ప్రాంతాలలో క్షుద్ర పూజలు జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన అవుకు పట్టణంలో కలకలం సృష్టిస్తుంది. రిజర్వాయర్ కట్టపై ప్రతిరోజు ఎంతో మంది వ్యాయామం చేసేందుకు వెళుతుంటారు. అక్కడికి వెళ్లిన వారిలో కొందరు చెట్ల కింద జరిగిన క్షుద్ర పూజలను గమనించి స్థానికులకు సమాచారం అందించారు. క్షుద్ర పూజలు జరిగిన ప్రదేశానికి వెళ్లి చూడగా అక్కడ నక్షత్రాకా రంలో పసుపు కుంకుమతో ముగ్గులు వేసి అక్కడే ఎల్లిపాయలు, కోడిగుడ్లు, చనిపోయిన నల్ల కోడిని అక్కడే వదిలి వేసి ఉండటంతో క్షుద్ర పూజలు జరిగాయని ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారు. గతంలో కూడా ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో క్షుద్ర పూజలు గుప్తనిధుల కోసం జరిగాయి. మరల కొంతకాలం తర్వాత అమావాస్య రోజు ఈ క్షుద్ర పూజలు జరగడం పట్ల ఎందుకోసం ఇక్కడ జరిపారు.ఎవ్వరు జరిపారు అన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.ఈ విషయంపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - నంద్యాల : భూమా నివాసం నందు 25 వార్డుకు చెందిన కేశాలురెడ్డి, ఖాజావుశేన్ వైసీపీ ని వీడి టీడీపీలో చేరారు. గురువారం నంద్యాల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డ్ ఇంచార్జి చలపతి, సునీల్, నబిరసూల్, హరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమా మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ప్రజల ఆశీర్వాదాలు జగనన్నకు ఉండాలి

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజా

సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజల ఆశీర్వాదాలు ఉండాలని రాష్ట్ర ఐడీసీ చైర్మన్ కర్ర గిరిజారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇంజేడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్య ఏదైనా అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని ప్రభుత్వం ప్రజలు నివాసం ఉంటున్న గ్రామాల్లోనే జగనన్న సురక్ష ద్వారా సేవలు అందిస్తూ ఉందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 126 మందికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి కసాని పుణ్య లక్ష్మీదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, సర్పంచ్ రామమోహన్, ఉపసర్పంచ్ దండేలా పార్థసారధి రెడ్డి, వైయస్ఆర్సీపీ నాయకులు కామిరెడ్డి ప్రతాప్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చదరంగ దినోత్సవం

విశాలాంధ్ర - పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ సమీపంలోని శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లో అంతర్జాతీయ చదరంగ దినోత్సవం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి మధుసూదన్ తెలిపారు.గురువారం కళాశాలలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల నుండి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి చదరంగం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరిగింది.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి మధుసూదన్ మాట్లాడుతూ చదవడం వల్ల విద్యార్థులకు మేధాశక్తి మరియు మానసికంగా విద్యార్థుల ఎదుగుదల అభివృద్ధి చెందుతుందని చెప్పడం జరిగింది.

బుక్కీ కీపర్స్ మోసాలు అరికట్టాలి

విశాలాంధ్ర - బనగానపల్లి: బుక్ కీపర్స్ చేసే మోసాలకు అద్దు అదుపు లేకుండా పోయాయని నంద్యాల జిల్లా గిరిజన సమైక్య అధ్యక్షుడు కాలింగ్ రాముడు పేర్కొన్నారు. రాముడు మాట్లాడుతూ పొదుపు సంఘాల, గ్రూపులో సభ్యులు బ్యాంకు బుక్‌కీపర్స్ అడిగినంత ఇవ్వాల్సిందేనీ పొదుపు సంఘాలు పది లక్షల రూపాయలు బ్యాంకు లోన్, లక్ష రూపాయలు పొందితే ఒక్కొక్క సభ్యురాలు వెయ్యి రూపాయలు బుక్కీపర్స్ కి ఇవ్వాలి 50,000 అయితే ఒక్కొక్క సభ్యురాలు 500 చొప్పున మరియు పొదుపు గ్రూపు సంఘం లో సభ్యులు చిన్న వ్యాపారం కొరకు సీఎం 10,000 వడ్డీ లేని రుణంకి, కమిషన్ డబ్బులు ఇవ్వాలని పొదుపు సభ్యుల పై డిమాండ్ చేస్తూ బుక్రిపేర్లు దందాలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సభ్యుడు ఖాదర్ భాష, గిరిజన సమాఖ్య నాయకుడు రఫీ, షాబీర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల కేంద్రమైన సి.బెళగల్ లో అప్పులు ఎలా తీర్చాలో అని మనస్థాపం చెంది ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది.గురువారం సి బెళగల్ ఎస్సై ఏసి పీరయ్య చెప్పిన వివరాల మేరకు కస్తూరిబా పాఠశాలలో హెల్పర్ గా పనిచేస్తున్న బుజ్జమ్మ ఆమె భర్త దాసరన్నగారి ఆంజనేయులు జడ్పీ హైస్కూల్ వెనక నివసిస్తున్నారు. దాసరన్న గారి ఆంజనేయులు స్వగ్రామమైన ఏ.గోకులపాడు గ్రామంలో గత రెండు సంవత్సరముల నుండి ఒక ఎకరా తనసొంత పొలంతో పాటు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేసి పంటలు సరిగా రాక సుమారు 5 లక్షల రూపాయలు అప్పు కావడం జరిగిందని ఆ అప్పు ఎలా తీర్చాలి అని మనస్థాపం చెంది బుధవారం తన భార్య బుజ్జమ్మ ఇంటి నుండి తన డైలీ పని కోసం స్కూల్ కి వెళ్లడం జరిగింది. భార్య స్కూల్ కి వెళ్ళిన తర్వాత భర్త ఆంజనేయులు బెలగల్ లోని ఇంటిలో తాడుతో ఉరివేసుకొని చనిపోయాడు అని గురువారం ఉదయం మృతి చెందిన ఆంజనేయులు భార్య బుజ్జమ్మ ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని సి బెలగల్ ఎస్సై ఏసీపీరయ్య తెలిపారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

విశాలాంధ్ర - కౌతాళం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి పెద్ద పీట వేయడం జరుగుతుందని మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగి

రెడ్డి అన్నారు. గురువారం ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో 2.14 కోట్లతో నిర్మించిన పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడం సీఎంకే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు అమరేష్, ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి, పాఠశాల కమిటీ చైర్మన్ రాముడు, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్మన్ నాగరాజు గౌడ్, కౌతాళం సహకార సంఘం అధ్యక్షులు దాట్ల కృష్ణంరాజు, వైసీపీ నాయకులు ప్రహల్లాద చారి సర్పంచ్ పాల్ దినాకర్, మాజీ సర్పంచ్ అవతారం, పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో ప్రాజెక్టులకు గుండు సున్నా

- ఆర్డీఎస్ కుడి కాలువ పనులు పునఃప్రారంభించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-కోసిగి : జగన్ ప్రభుత్వంలో ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా గుండుసున్న చుట్టారని ,మండల పరిధిలోని అగసనూరు గ్రామ సమీపాన ఉన్న రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డిఎస్) కుడి కాలువ పనులను పునఃప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య , సహాయ కార్యదర్శి మునెప్పలు డిమాండ్ చేశారు. గురువారం మండల కార్యదర్శి గోపాల్, తాలూకా అధ్యక్షులు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా బృందం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రిజర్వాయర్ల నిర్మాణాలను పూర్తిగా మరిచారని మండిపడ్డారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జలయజ్ఞం పేరుతో ఎన్నో రిజర్వాయర్లను, ప్రాజెక్టులను నిర్మించాడని గుర్తు చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఆర్డీఎస్ నుంచి కుడి కాలువ ఏర్పాటుకు నాలుగు టిఎంసిల నీరు కేటాయించడం జరిగిందని,తెలుగుదేశం ప్రభుత్వంలో 1985.42 కోట్ల రూపాయలతో అంచనా వేయడం జరిగిందని, ప్రభుత్వం మారక ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం లో 2019 సంవత్సరంలో 1640 కోట్ల రూపాయలకు నాగర్జున కన్స్ట్రక్షన్ కంపెనీ టెండర్ ను చేజిక్కించుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయకపోవడంతో, 13 కోట్ల రూపాయలతో కంపెనీ హెడ్ రెగ్యులేటర్ ను నిర్మించిన , ఇంతవరకు నయా పైసా ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో కంపెనీ చేతులెత్తేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిలిచిపోయిన ఆర్డీఎస్ కుడికాలువ పనులు చేపట్టాలన్నారు. కుడి కాలువ నిర్మాణానికి కావలసిన భూమి సైతం ఇంతవరకు పూర్తిస్థాయిలో సర్వే చేయలేద

న్నారు. అదేవిధంగా భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణం చేపడితే పశ్చిమ ప్రాంతమైన కర్నూలు జిల్లాల్లో పలు మండలాల్లో వలసలు వెళ్లకుండా నివారించవచ్చన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇప్పటికే నాలుగున్నర సంవత్సరాలు పూర్తయిన ఇంతవరకు ఆర్డీఎస్ పై కన్నెత్తి చూడటం లేదన్నారు. కుడి కాలువ పనులు పూర్తిస్థాయిగా అయితే దాదాపు 40 వేలఎకరాలకు సాగునీరు అంది,వందలాది గ్రామాలకుత్రాగునీరుఅందుతుందన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిలిచిపోయిన ఆర్డీఎస్ కుడికాలువ పనులను ప్రారంభించాలని లేనిపక్షంలో ప్రజాసంఘాలను ప్రజలను రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రంగన్న , వీరేష్ , నాయక్ , ఓంకార్ స్వామి,ఈరన్న , ఆంజనేయులు , కృష్ణ , చంద్ర , రామాంజనేయులు ,నరసింహులు , నాగరాజు ,వగరూరు భాష ,ఏఐవైఎఫ్ నాయకులు రాజు, విజయేంద్ర ,మరియు రైతులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

త్రాగునీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆలూరు : పట్టణంలో నెలకొన్న త్రాగునీటి

సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, మండల కార్యదర్శి రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం తాలూక నాయకులు చంద్రకాంత్ రెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సచివాలయ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ మోహన్‌కు సమస్యలతో కూడిన వినిత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో త్రాగునీటి సమస్యతో కోయనగర్, సిద్దేశ్వర కాలనీ,ఎస్సీ కాలనీ, గోవర్ధన్ టాకీస్ బ్యాక్ సైడ్ వార్డులలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,తుంగభద్ర నుంచి రావాల్సిన నీరు సకాలంలో రాకపోవడం వల్ల పట్టణ ప్రజలు త్రాగునీటి కోసం ఎదురుచూసే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వారంలో మూడు రోజులకు ఒకసారి అయినా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో నెలకొన్న త్రాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో దశలవారీగా సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు శివ, శ్రీరాములు, రంగన్న, హమాలీ యూనియన్ నాయకులు రామాంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలంటే వైసీపీ నేతలకు గౌరవం లేదు

- అనిత పట్ల వైసీపీ సోషల్ మీడియా సభ్యత, సంస్కారం లేకుండా వ్యవహరిస్తోంది
- వైసీపీ నేతల ఇళ్లు ముట్టడించి తగిన బుద్ధి చెబుతాం
- తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.సుకన్యా దేవి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : వైసీపీ నేతలకు, కార్యకర్తలకు, సోషల్ మీడియా వ్యక్తులకు మహిళలంటే గౌరవం లేదని, ఆ పార్టీ నేతలను విమర్శిస్తే చాలు మహిళలను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకరంగా, జుగుప్సాకరమైన పోస్టులు పోస్ట్ చేస్తున్నారని తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి సుకన్య దేవి ఆరోపించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై దాడులు,హత్యలు,అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. దిశ చట్టం ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తామని ప్రగల్భాలు పలికిన నేతలు ఇప్పటి వరకు ఆ చట్టం కింద ఎంత మందిని శిక్షించారో చెప్పాలని డిమాండ్ చేశారు. లేని చట్టం పేరుతో నాలుగేళ్లుగా హడావిడి చేస్తూ మహిళను మహిళలను జగన్ మోసం చేశారని ఆరోపించారు. మహిళ పై జరుగుతున్న ఘోరాలను, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎప్పటికప్పుడు తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శిస్తుంటే సమాధానాలు చెప్పలేక వైసీపీ నేతలు సోషల్ మీడియాలో వ్యక్తిగత దాడికి దిగి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే వైసీపీ నేతల తల్లి, చెల్లి, అకాలను అంటే భరిస్తారా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో తెలుగు మహిళ పట్ల వైసీపీ నేతలు, వారి సోషల్ మీడియా దారుణంగా వ్యవహరిస్తున్నా పోలీసులు గానీ, మహిళా కమిషన్ గానీ కళ్లుండి చూడలేని కబోదులుగా మారారని ఆరోపించారు. అదే వైసీపీ నేతల పై చిన్న పోస్ట్ చేసినా వెంటనే సీఐడీ అధికారులు, మహిళ కమిషన్ రంగంలోకి దిగి నోటీసులు ఇవ్వటం, అరెస్ట్ కు చెయ్యడం చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం మహిళల పక్షపాతి పభుత్వం అని చెప్పుకునే వైసీపీ నేతలు మహిళలు ఇచ్చే గౌరవం ఇదేనా..?మీ తల్లదండ్రులు మీకు నేర్పిన సంస్కారం ఇదేనా..?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళల పట్ల మీరు వ్యవహరిస్తున్న తీరు అన్ని గమనిస్తున్నమని, త్వరలో అందరికీ వడ్డీతో సహా చెల్లిస్తామని చెప్పారు. ఇక నుంచి మహిళల గురించి తప్పుడు పోస్టులు చేసినా.. తప్పుగా మాట్లాడినా వారి ఇల్లు ముట్టడించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని మహిళల పట్ల గౌరవంగా ఎలా నడుచుకోవాలో నేర్చుకోవాలని హితవు పలికారు. లేదంటే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఓటరు జాబితాను పరిశీలించండి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ ,తహశీల్దార్ వీరేంద్ర గౌడ్ ను ఆదేశించారు. గురువారం పెద్దకడబూరులోని తహశీల్దార్

కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటర్ల జాబితాలో ఫామ్-6 లో పేర్లు నమోదు చేయించాలని సూచించా రు. ఇతర పట్టణాలలో స్థిరపడినవారు, మరణించిన వారి పేర్లను ఫామ్-7 నమోదు చేసి తొలగించాలన్నారు. మంత్రాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం పెద్దకడబూరులోని ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలోని పోలింగ్ బూతులను పరిశీలించారు. ఈమె వెంట రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేష్, వీఆర్వో నరసప్ప తదితరులు ఉన్నారు.

కొత్తకోట వరకు రోడ్డు వేయాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల కేంద్రమైన సి.బెళగల్ నుండి చెరువు పల్లె, కొండాపురం మీదుగా రోడ్డు వేయాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జె మోహన్ అన్నారు. కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి మరియు సి బెళగల్ మండలఅభివృద్ధి కొరకు గురువారం బెలగల్ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు వెంకట్, చిన్నఅక్బర్ ల అధ్యక్షతన జీపు జాతను ప్రారంభించారు. జీపు జాతర మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించడం జరిగింది. బెలగల్ నుండి చెరువు పల్లె, మీదుగా ఉన్న రోడ్డును సిపిఎం జీపు జాత బృందం పరిశీలించి వెంటనే రోడ్డు వేయాలని పలుకు దొడ్డి గ్రామం దగ్గర పాదయాత్ర చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ బెలగల్ నుండి చెరువు పల్లె మీదుగా కొత్తకోట వరకు ఉన్న రోడ్డు పూర్తిగా చేరిందని ఈ రోడ్డు మార్గంలో ప్రజలు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బెలగల్ చెరువును రిజర్వాయర్లు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మండలంలోని అన్ని గ్రామాలకు అనుసంధానమైన రోడ్లను వెంటనే వేయాలని బెలగల్ కస్తూరిబా హాస్టల్ నుండి మోడల్ స్కూల్ వరకు ఉన్న ప్రధాన రహదారిని వంద అడుగుల విస్తీర్ణం చేసి రోడ్డు వేసి ప్రమాదాలను నివారించాలని వారు అన్నారు.

ఘనంగా సన్మానం

విశాలాంధ్ర - కర్నూలులీగల్ : రాయలసీమ క్రిస్టియన్ వీధి

కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేస్తున్న ధారపోగు ప్రకాష్ గురువారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఘనంగా శాలువాతో పూలమాలతో సత్కరించారు . గురువారం నగరంలోని ఏ క్యాంప్‌లోని రాయలసీమ క్రిష్టియన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దారపోగు ప్రకాష్ తెలుగు విభాగంలో ఆచార కొనుకొల్లూరి ఇనాక్ కవితం సామాజిక చైతన్యం అనే అంశం పైన చేసిన పరిశోధనకు గాను రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా పొందినందుకు కళాశాల సిబ్బందితో ఘనంగా సత్కరించడం జరిగింది ఇలాంటి ఎన్నో పట్టా పొందాలని వారు సూచించారు. మా కళాశాలకు మంచి పరిణామం అన్నారు .ఇలాంటి వారు ఉండడంవల్ల మా కళాశాలకు మంచి పేరు వస్తుందన్నారు .ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకే కార్డెన్ సర్చ్

విశాలాంధ్ర - ఆస్పరి : నేరాల అదుపునకే కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరుగుతుందని పత్తికొండ డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బిల్లేకల్లు గ్రామంలో ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను డిఎస్పి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మొహరం పండగ సందర్భంగా బిల్లేకల్లు సమస్యాత్మక గ్రామం కావడంతో ప్రజల రక్షణ, వారికి భద్రతా భావం, సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరుస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందన్నారు. నేరరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెంట్ తప్పకుండా ధరించాలని వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. పాత వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు డాక్యు మెంట్లు చెక్ చేసుకోవాలన్నారు.

హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా, మద్యం సేవించి వాహనాలను నడ పొద్దని సూచించారు. చాలా మంది యువత ఆన్లైన్ మోసాలకు బలి అవుతున్నారని ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో హనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్డెన్ సర్చ్ లో భాగంగా సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను పోలీసు స్టేషన్ కు తీసుకువెళ్లడం జరిగింది. అలాగే గ్రామ సమీపంలో ఉన్న కొండలో 50 లీ. బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు సీఐ వెంకటేశులు, పత్తికొండ టౌన్ సిఐ రామకృష్ణారెడ్డి, తాలూకా సిఐ మురళీమోహన్, ఆస్పరి ఎస్సై వరప్రసాద్ తో పాటు నలుగురు ఎస్సైలు 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితలో అవకతవకలు లేకుండా చుడాలి

విశాలాంధ్ర-దేవనకొండ: ఓటర్ల జాబితలో అవకతవకలు లేకుండా చుడాల్సిన భాద్యత బిఎల్ఓ లదేనని తహశీల్దార్ వెంకటేష్ నాయక్ అన్నారు.గురువారం స్థానిక ఎమ్పీడిఓ కార్యాలయంలో మండలం లోని బిఎల్ఓలు,విఆర్వోలతో సమావేశం నిర్వహించారు.ఒకే ఇంట్లో అధికంగా ఓటర్లు ఉంటే పరిశీలించాలని ,వందేళ్ళు పైబడిన వృద్దులను,డంబల్ ఎంట్రీలను పరిశిలించాలన్నారు .ఓటర్ల జాబితలో ఇబ్బందులు తల్తెత్తితే బిఎల్ఓలపై చర్యలు తప్పవన్నారు.

డెబిట్ కార్డు ద్వారా యాక్సిడెంటల్ క్లైమ్

విశాలాంధ్ర - కర్నూలు : యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా ఖాతా దారుడు ప్రమాదంలో మరణించడంతో అతనికి ఏటీఎం వీసా కార్డు ద్వారా అతనికి 2,00,000 బీమా అందచేసినట్లు బ్యాంక్ మేనేజర్ స్వరూప్ తెలిపారు. కర్నూలుకు చెందిన మృతుడు పీ వినయ్‌కుమార్(24) కజకిస్తాన్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ విషయం సదరు కుటుంబ సభ్యులు బ్యాంక్

మేనేజర్‌కు తెలియచేయడంతో మరణించిన వ్యక్తి వీసా డెబిట్‌కార్డు ఉండటంతో దాని ద్వారా 2,00,000 మృతునికి వస్తాయని తెలిపారు. దీంతో డిప్యూటి మేనేజర్ సంజీవకుమార్ దీనిపై మృతుని కుటుంబానికి ఆదుకునేందుకు తన వంతు కృషిచేసి బ్యాంక్ నుండి మృతుని కుటుంబానికి క్లైం మంజూరు అయ్యోందుకు శక్తి వంచన లేకుండా కృషిచేశాడని మేనేజర్ తెలిపారు. భీమా సొమ్మును ఇన్స్‌రెన్స్ కంపెనీ ద్వారా నామిని పసెద్దుల ప్రసాద్‌కు చెక్కును అందచేశారు.దీంతో కుటుంబ సభ్యులు బ్యాంక్ మేనేజర్‌కు, డిప్యూటీ మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు.ఈ సందర్భంగా మేనేజర్ ఖాతాదారులు అం దరూ ఏటీఎం కార్డును వినియోగించుకోవాలని కోరారు.

వీఆర్ఏ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కోసిగి : వీఆర్ఏల సమస్యల పరిష్కరించాలని కోరుతూ గురువారం రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైయస్సార్ సర్కిల్ నందు గురువారం దీక్షలు చేపట్టడం జరిగింది. ముందుగా ఈ దీక్షలను కేవిపిఎస్ మాజీ నాయకులు విజయ్ కుమార్ పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ దీక్షలను ఉద్దేశించి వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు అంజి , సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో బాగంగా అధికారంలోకొస్తే వీఆర్ఏ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి , ఇంతవరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పే స్కేల్ అమలు చేసి , అదేవిధంగా నామినీలుగా ఉన్న వీఆర్ఏలను వీఆర్ఏలుగా గుర్తించి , వీఆర్ఏలకు పదోన్నతి కల్పించి , డి ఏ రికవరీ ఆపి డి ఏ తో కూడిన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు ప్రహ్లాద్ ,సిఐటీయు మండల ఉపాధ్యక్షులు వీరేష్ , రెవెన్యూ సహాయకుల సంఘం డివిజన్ అధ్యక్షులు రాజు, మండల వీఆర్ఏల సంఘం నాయకులు శాంతరాజు , తిక్కయ్య ,గురుస్వామి , నాగరాజు , లక్ష్మన్న , ఈరమ్మ , మహాదేవి , చిన్న ఈరమ్మ , నాగేష్ , పురుషోత్తం,ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తమ డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గోనెగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో వీఆర్ఏలు రెండు రోజుల నిరసన దీక్షను గురువారం ప్రారంభించారు.గోనెగండ్ల లోని తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా శిబిరం ఏర్పాటు చేసుకుని వారు మొదటి రోజు దీక్షలో కూర్చున్నారు.రంగన్న రామాంజనేయులు హనుమంతు పెద్ద బజారి మోహన్ లక్ష్మీ దస్తగిరి టీ రంగన్న పాల్గొన్నారు.

సి.బెళగల్ : మా న్యాయమైన కోరికలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వీఆర్ఏలుగా పని చేస్తున్నటువంటి వారు గురువారం మండల తహశీల్దార్ శేషఫణికి విన్నవించుకుని వారి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మేము సి బెళగల్ మండలం నందు గ్రామ రెవెన్యూ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్నామని మాకు ప్రస్తుతం 10,500 మాత్రమే నెలసరి వేతనం వస్తున్నదని ఆ వేతనంతో చాలీచాలని జీతంతో మా కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. గత కొన్ని సంవత్సరంల నుండి కష్టాలను అనుభవిస్తున్నామని మాన్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు.



ముగిసిన టీచర్ల ఐ.ఎఫ్.పి శిక్షణ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు ,ఆదోని డివిజన్

పరిధిలోని రెండువేల మంది టీచర్లకు గత పది రోజుల నుండి బ్యాచ్ కు రెండు రోజుల చొప్పున నగర శివారులోని పుల్లారెడ్డి కళాశాలలో జరిగిన టీచర్ల ఐ.ఎఫ్.పి శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి.ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లను జిల్లా విద్యాశాఖ తరపున జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి. రంగారెడ్డి జ్ఞాపికతో పాటు శాలువా నుకప్పి సత్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు అశోక ఇంజనీరింగ్ కళాశాల, పుల్లారెడ్డి ఇంజనీరింగ్, పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సాంకేతికను అందిపుచ్చుకొని విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందించాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన అన్ని పాఠ్యాంశాలకు సంబంధించిన బోధనా అంశాలను ఐ.ఎఫ్. పి ప్యానెల్ లో పొందుపరిచినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులకు సులభతరంగా ఐఎఫ్ పి ప్యానల్ ద్వారా బోధన పద్ధతులను సమకూర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పుల్లారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఐ.ఎఫ్.పి ప్యానెల్స్ ద్వారా విజ్ఞానాన్ని అందించేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని ప్రతి ఉపాధ్యాయుడు కూడా ఐ.ఎఫ్.పి ప్యానల్ ద్వారా బోధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ పేద, బడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు చదివే సర్కారి పాఠశాలలో కోట్ల రూపాయలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం ఐ.ఎఫ్.పి లను అందించడం శుభ పరిణామం అని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పది రోజుల పాటు శిక్షణను ఇచ్చిన మాస్టర్ ట్రైలర్లతో పాటు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్లుగా వ్యవహరించిన వ్యయము ఉపాధ్యాయులు ముల్లా మహమ్మద్ భాష, పరమేష్ ,వెంకటేష్ తో పాటు.. టీచర్లకు శిక్షణ ఇచ్చిన మాస్టర్ ట్రైనర్లు ఎం ఆనంద్, ఎం మహేష్ ,డాక్టర్ రాజశేఖర్ ,డాక్టర్ షంషీర్ ,డాక్టర్ రమేష్, డాక్టర్ అభినయవుద్దీన్, రవిశంకర్ రెడ్డి, డాక్టర్ ఎన్ .ఎం శశిధర్, వై పద్మశ్రీనాథ్ రెడ్డి, ఎస్ వి గరిటారెడ్డి ,పి సురేష్ బాబు, జె మహిన్, వి జ్యోతి, కే సుధాకర్, బి అరుణ్ కుమార్, కే హరీష్ రెడ్డి పాల్గొన్నారు.

మాస్ మహారాజ రవితేజ నటించిన 'రావణాసుర' మీ జీ తెలుగులో

విశాలాంధ్ర - కర్నూలు : తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలో ఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. మాస్ మహారాజ రవితేజ నటించిన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర' సినిమాని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరో రవితేజ క్రిమినల్ లాయర్ రవీంద్రగా మెప్పించిన 'రావణాసుర', జూలై 23 ఆదివారం సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో .దర్శకుడు సుధీర్ వర్మ డైరెక్షన్లో రూపొందిన ఈ సినిమాను అభిషేక్ నామా, రవితేజ సంయుక్తంగా నిర్మించారు. అయిదుగురు హీరోయిన్లు ఫరియాఅబ్దుల్లా, మేఘాఆకాష్, అనుఇమ్మాన్యుయేల్, పూజితాపొన్నాడ, దక్ష నగార్కర్ నటించారు. సంపత్ రాజ్, జయరాం, సుశాంత్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు.

రోడ్డు మరమ్మత్తు చేసి ప్రజల కష్టాలు తీరుస్తాం

విశాలాంధ్ర - హొళగుంద : మార్లమడకి మరియు హెళగుంద వయా

హెబ్బటం ,ధనాపురం రోడ్డు మరమ్మతు చేసి ప్రజల కష్టాలు తీరుస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మార్ల మడ కిలో గురువారం గడపగడప కార్యక్రమం జరిగింది కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ మిగిలిన గ్రామాలకు 14 కోట్ల 16 లక్షల 80 వేల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఖాతాలకునేరుగా అందాయని అన్నారు .ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటివరకు ఎన్నో సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నాడని కొనియాడారు .నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు .వచ్చే ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వాన్ని అధికారంలో తీసుకురావడానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు .గ్రామానికి 10 లక్షల రూపాయలతో సీసీ డ్రైనేజ్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గ్రామ సచివాలయం ప్రారంభోత్సవాన్ని మంత్రి గుమ్మనూరు జయరాం ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎంకప్ప, వైకాపా నాయకులు రమేష్ ,మోహన్ రాజు, చంద్ర ,వెంకటేష్ ,కన్నా ,వైకాపా మండల కన్వీనర్ షఫీ ఉల్లా ,ఎంపీపీ నూర్జహం తనయుడు ఇసా ,విండో చైర్మన్ మల్లికార్జున, యం డి ఓ రాధా తహశీల్దార్ హుస్సేన్ సాబ్, గ్రామ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వీఆర్వో సు రాంజనేయ వాలంటీర్లు గ్రామ సచివాలయం సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలి

ఆదోని - దనాపురం ,హెళగుంద రోడ్డు వేసేందుకు గత నాలుగు సంవత్సరాల కిందట 64 కోట్లు రూపాయలు ప్రభుత్వం విడుదల చేసింది. నాలుగు సంవత్సరాలు అయినా రోడ్డువేయలేదు సీపీఐ మండలకార్యదర్శి మారెప్ప విమర్శించారు. గురువారం ఆధ్వర్యంలో స్థానిక హెళగుంద బస్టాండ్‌లో ధర్నా చేశారు. ఆదోని - దనాపురం మీదుగా వెళుతున్న హెళగుంద రోడ్డు నిలిచిపోయిన రోడ్డు పనులు ప్రారంభించి ఈ రోడ్డు మార్గంలో బస్సు యధావిధిగా కొనసాగించాలనికోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సలాం సబ్ రైతు సంఘం నాయకులు కృష్ణయ్య ,మూలసాబ్, ఆటో యూనియన్ రుద్ర గౌడ్ ,వెంకటేష్ శివప్ప పాల్గొన్నారు.